సాక్షి ములుగు

బుధవారం । 4 । డిసెంబర్ । 2024



హరీశ్‌కు కన్నీటి వీడ్కోలు..

వాజేడు ఎస్సై రుద్రారవు హరీశ్ అంత్యక్రియలు ఆయన స్వగ్రామం కొత్తపల్లిగోరి మండలం వెంకటేశ్వర్లపల్లిలో అశ్రునయనాల మధ్య ముగిశాయి. - 8లో



రోజంతా పడిగాపులు..

చెల్పాక ఎన్‌కౌంటర్‌లో నేలకొరిగిన మావోయిస్టుల మృతదేహాలను మంగళవారం కుటుంబ సభ్యులకు అప్పగించారు. - 8లో

గరిష్టం/కనిష్టం
$30.3^0/23.1^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం సాధారణంగా ఉంటుంది. రాత్రిపూట చలితో పాటు మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

రామప్పను సందర్శించిన స్విట్జర్లాండ్ దేశస్తుడు



వెంకటాపురం(ఎం): ప్రపంచ ప్రసిద్ధి చెందిన రామప్ప దేవాలయాన్ని మంగళవారం స్విట్జర్లాండ్‌కు చెందిన బ్రోనో సందర్శించారు. రామప్ప రామలింగేశ్వరస్వామిని ఆయన దర్శించుకోగా ఆలయ పూజారులు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వచనం చేశారు. రామప్ప శిల్పకళ సంపద గురించి గైడ్ తాడబోయిన వెంకటేశ్ వివరించగా రామప్ప ఆలయం అద్భుతంగా ఉందని కొనియాడారు.

వ్యాసరచన పోటీలు



మంగపేట: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల విద్యార్థినులకు మంగపేట అటవీశాఖ రేంజ్ కార్యాలయ డిప్యూటీ రేంజ్ అధికారి కోటేశ్వర్ ఆధ్వర్యంలో అటవీ అగ్ని ప్రమాదాల నివారణపై వ్యాసరచన పోటీలను మంగళవారం నిర్వహించారు. పోటీలలో ప్రతిభ కనబర్చిన విజేతలకు ఆయన బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అడవిలో జరిగే అగ్నిప్రమాదాలు వాటిని నివారించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామాల్లోని ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ స్పెషలాఫీసర్ భాగ్యలక్ష్మి, అధ్యాపకులు, మంగపేట రేంజ్ పరిధిలోని అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్లు, బీటు అధికారులు పాల్గొన్నారు.

పోడు భూములకు పట్టాలివ్వాలి



వెంకటాపురం(కె): కొమురం భీమ్ కాలనీ ఆదివాసీలు సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలివ్వాలని గొండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి అన్నారు. మండల పరిధిలోని కొమురం భీమ్ కాలనీ గ్రామంలో గొండ్వానా సంక్షేమ పరిషత్ ముఖ్య కార్యకర్తల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30ఏళ్లుగా ఆదివాసీలు సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలివ్వాలన్నారు. లేని పక్షంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మనోజ్, రాజేశ్, భీమయ్య, లక్ష్మయ్య, సమ్మక్క అనిల్ పాల్గొన్నారు.

నేలవాలిన చెట్లపై పట్టింపేది!

ములుగు: ఆగస్టు 31న ఏటూరునాగారం అభయారణ్యంలో టోర్నడోల్‌తో నేలవాలిన చెట్ల గురించి అధికారులు పట్టించుకోవడం లేదని పర్యావరణవేత్త డాక్టర్ సుతారి సతీశ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మేడారం -ఎస్ఎస్‌తాడ్వాయి, దొడ్ల- కొత్తూరు, జలగలంచ-లవ్వాల అడవుల్లో 334 హెక్టార్లలో సుమారు 2లక్షల మొక్కలు నేలవాలగా పీసీసీఎఫ్ డాక్టర్ గోబ్రియల్ సెప్టెంబర్ 3, 4 తేదీలలో పర్యటించారని వివరించారు. ఈ విషయంపై 24వ తేదీన హైదరాబాద్‌లో అభయారణ్య భవనంలో పలు రకాల చర్యలు చేపట్టాలని సూచించినా ఆచరణలో మాత్రం శూన్యంగా మారిందని ఆరోపించారు. స్థానిక అధికారులు నేలవాలిన చెట్ల గణన చేపట్టినా అది ఎక్కడివరకు వచ్చిందో ఎవరికి తెలియకుండా పోయిందని పేర్కొన్నారు. అడవి విధ్వంసంపై జాతీయస్థాయిలో కరెంట్ సైన్స్ జర్నల్‌లో తాను నవంబర్ 25న శాస్త్రోక్తంగా ప్రచురణకు వివరాలు అందించానని తెలిపారు. సంఘటన జరిగి మూడు నెలలు కావొస్తున్నా తీసుకున్న చర్యలపై పూర్తి నివేదికను తెలియజేయాలని డిమాండ్ చేశారు.

పోలీసుల తనిఖీ



కాళేశ్వరం: పీఎల్‌జీఏ వారోత్సవాలు, ఏటూరునాగారం ఎన్‌కౌంటర్ నేపథ్యంతో మహదేవపూర్ సరిహద్దులో పోలీసులు అప్రమత్తమయ్యారు. మహదేవపూర్ మండలకేంద్రంలో ఎస్సై పవన్‌కుమార్ ఆధ్వర్యంలో తెలంగాణ టు మహారాష్ట్రకు వచ్చిపోయే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనుమానితులు కనిపిస్తే విచారించి వదిలేశారు. ఆయన వెంట సివిల్ పోలీసులు ఉన్నారు.

మల్లూరు ప్రాజెక్టుకు..

మరమ్మతులేవి?

శిథిలావస్థకు చేరుకున్న మత్తడి

- పూర్తిగా పాడైపోయిన అపరాన్
- కాల్వల్లో పేరుకుపోయిన పూడిక, పలుచోట్ల గండ్లు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

మంగపేట: మండల పరిధిలోని నర్సింహాసాగర్ వద్ద మల్లూరువాగుపై నిర్మించిన మధ్యతరహా ప్రాజెక్టు మరమ్మతులను పాలకులు మరిచారా అని ఆయకట్టు రైతులు ప్రశ్నిస్తున్నారు. ప్రాజెక్టును ఆధునికీకరించి అభివృద్ధి చేస్తామని బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో అప్పటి భారీ నీటిపారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఇచ్చిన హామీ బుట్టదాఖలు అయ్యాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అయినా ప్రాజెక్టు అభివృద్ధిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో అసలు ప్రాజెక్టు ఉందన్న విషయం ప్రభుత్వం దృష్టిలో ఉందా అనే సందేహాన్ని వ్యక్తం చేస్తున్నారు.

మండల పరిధిలోని సుమారు 10గ్రామ పంచాయతీల పరిధిలోని వేలాది ఎకరాలకు సాగునీరు అందించాలన్న లక్ష్యంతో 26అడుగుల నీటిమట్టం సామర్థ్యంతో 1976లో అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు ప్రాజెక్టు పనులకు శంకుస్థాపన చేశారు. 1980లో ప్రాజెక్టు నిర్మాణం పూర్తికావడంతో మొట్ట మొదటిసారి ఆయకట్టు భూములకు సాగునీటిని వదిలారు. నర్సింహాసాగర్, పూరేడుపల్లి, శనిగకుంట, మల్లూరు, వాగొడ్డుగూడెం, రమణక్కపేట, చుంచుపల్లి వరకు గల 17కిలోమీటర్ల కుడికాల్వ ద్వారా సుమారు 4,300 ఎకరాలు, బాలన్నగూడెం, తిమ్మంపేట, మంగపేట, చెరుపల్లి తదితర గ్రామాల వరకు 8కిలో మీటర్ల ఎడమ కాల్వ ద్వారా 3,500 ఎకరాల ఆయకట్టు భూములకు రెండు పంటలకు సాగునీరు అందాల్సి ఉంది. 27ఏళ్ల నుంచి ప్రాజెక్టు నిర్వహణపై సంబంధిత ఇరిగేషన్ అధికారుల పర్యవేక్షణ క్షేత్రస్థాయిలో లేకపోవడంతో ప్రాజెక్టు అభివృద్ధిపై పాలకులు అంతగా శ్రద్ధ చూపకపోవడంతో నిరాదరణకు గురైంది. ఫలితంగా వర్షాభావ పరిస్థితులు అనుకూలించినా రెండు నుంచి నాలుగు పర్యాయాలు తప్ప ఎప్పుడు కూడా పూర్తి ఆయకట్టు భూములకు సాగునీరందిన సందర్భాలు లేవని రైతులు ఆరోపిస్తున్నారు. 2007లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి పుణ్యమా అంటూ ప్రాజెక్టు ఆధునికీకరణకు



మత్తడి వద్ద పూర్తిగా ధ్వంసమైన అపరాన్

రూ.16 కోట్ల జపాన్ (జైకా) నిధులు మంజూరు అయ్యాయి. పనులపై పర్యవేక్షణ లేకపోవడంతో పనులను అసంపూర్తిగా చేసి కోట్ల రూపాయల నిధులను కాంట్రాక్టర్లు, అవినీతి అధికారులు అందినకాడికి దండుకున్నారు. ఆనాటి నుంచి ఇప్పటి వరకు కుడి, ఎడమ కాల్వల తూములకు ఏర్పడిన లీకేజీలకు మరమ్మతులు, ప్రాజెక్టు కట్టపై చెట్ల తొలగింపు పనుల పేరుతో పదేళ్ల కాలంలో కొందరు స్థానిక రాజకీయ నాయకులు, అధికారులు కుమ్మక్కై లక్షల రూపాయలు దండుకుని చేతులు దులుపుకున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.

చుట్టపు చూపుగా అధికారులు

ప్రాజెక్టు బాగోగులు చూడాల్సిన అధికారులు చుట్టపు చూపుగా అలా వచ్చి ఇలా వెళ్తున్నారే తప్ప ఏమాత్రం శ్రద్ధ చూపడం లేదని ఆయకట్టు రైతులు మండి పడుతున్నారు ప్రాజెక్టుపై సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, పాలకులు పట్టించుకోకపోవడం తమకు శాపంగా మారిందని వాపోతున్నారు. ప్రధానంగా కుడి, ఎడమ కాల్వల నిర్వహణపై సంబంధిత ఇరిగేషన్ బోర్డు అధికారులు ఏమాత్రం దృష్టి సారించక పోవడంతో కాల్వల్లో సిల్ట్ పేరుకుపోయి సాగునీరు అందడం లేదని రైతులు వాపోతున్నారు. ప్రాజెక్టు మత్తడి వద్ద గైడ్‌వాల్స్ కోతకు గురై పూర్తిగా ధ్వంసమయ్యాయి. అపరాన్ పూర్తిగా ధ్వంసమై రాళ్లు తేలి కనిపిస్తున్నాయి. ఇలాగే వదిలేస్తే వచ్చే వర్షాకాలంలో మత్తడి నుంచి వరద నీరు భారీ స్థాయిలో ప్రవహిస్తే మత్తడి కొట్టుకుపోయే ప్రమాదం ఉందని రైతులు ఆరోపిస్తున్నారు.

హామీలు నీటిమీద రాతలు

2015లో అప్పటి డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి,



మత్తడి వద్ద వరద కోతతో కూలిన గైడ్‌వాల్

భారీ నీటిపారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, దివంగత మంత్రి చందూలాల్ ప్రాజెక్టును సందర్శించారు. వెంటనే ప్రాజెక్టు అభివృద్ధికి, కుడి, ఎడమ కాల్వలు, తూముల నిర్మాణం ఆధునికీకరణ పనులు చేపట్టేందుకు ఎస్టిమేట్ నివేదిక తయారు చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. కానీ అమలు చేయడంలో మాత్రం పూర్తిగా విఫలమయ్యారు. అధికారులు సైతం ప్రాజెక్టు బాగోగులను పట్టించుకోక పోవడంతో మండలంలోని వాడగూడెం నుంచి చుంచుపల్లి మధ్య కాల్వలను ధ్వంసం చేసి సాగుభూముల్లో కలుపుకున్నా అధికారులు మాత్రం ఎందుకు పట్టించుకోవడం లేదని పలువురు రైతులు ప్రశ్నిస్తున్నారు. ప్రజా ప్రభుత్వం, రైతుల పక్షపాతిగా చెబుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టు అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి పూడిక పేరుకుపోయి గండ్లు పడిన కుడి, ఎడమ కాల్వల లైనింగ్ పనులు చేపట్టేందుకు నిధులు మంజూరు చేసి ఆయకట్టు చిట్టచివర భూములకు సాగునీరు అందేలా చూడాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

ప్రాజెక్టు అభివృద్ధికి నిధులు కేటాయించాలి..



మండలంలో వేలాది ఎకరాలకు సాగునీరు అందించే ప్రాజెక్టు అభివృద్ధి పనులకు ప్రభుత్వం నిధులు కేటాయించాలి. ప్రభుత్వం ఏజెన్సీ ప్రాంతంలోని మల్లూరు మధ్యతరహా ప్రాజెక్టు అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తే రెండు పంటలకు సాగునీరు అందే అవకాశం ఉంది. ప్రభుత్వం తక్షణమే స్పందించి యుద్ధ ప్రాతిపదికన తూముల లీకేజీలు, మత్తడి మరమ్మతులు, కాల్వల లైనింగ్ పనులు చేపట్టేందుకు నిధులు కేటాయించాలి.

- కాడబోయిన నరేందర్, రైతు, నర్సింహాసాగర్

లీకేజీలకు మరమ్మతులు చేపట్టాం..



ప్రాజెక్టు ఎడమ కాల్వల తూముల లీకేజీకి ఇప్పటికే రూ.3.68 లక్షలతో మరమ్మతులు చేసి లీకేజీలను అరికట్టాం. మత్తడి పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో మరమ్మతులు చేపట్టేందుకు గతేడాది క్రితం ఎస్టిమేట్ నివేదికను అప్పటి ప్రభుత్వానికి అందజేశాం. రెండు నెలల క్రితం ప్రస్తుత ప్రభుత్వానికి నూతన ఎస్ఎస్ఆర్‌తో రూ.7.79 కోట్ల అంచనాతో ఎస్టిమేట్ నివేదికను ఉన్నతాధికారుల ద్వారా ప్రభుత్వానికి పంపించాం.

- వలీమ్ మహ్మద్, ఇరిగేషన్ ఏఈ

అవినీతి రహిత జిల్లాగా మార్చుకుందాం



అవినీతి నిరోధక శాఖ వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ దివాకర



కలెక్టర్ దివాకరకు పుష్పగుచ్ఛం అందిస్తున్న జీఎం రాజేశ్వర్‌రెడ్డి

కలెక్టర్ టీఎస్.దివాకర

ములుగు: ములుగును అవినీతి రహిత జిల్లాగా మార్చుకుందామని కలెక్టర్ టీఎస్.దివాకర పిలుపునిచ్చారు. ఈ మేరకు కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో ఈ నెల 9వ తేదీ వరకు జరగనున్న అవినీతి నిరోధక శాఖ వారోత్సవాల పోస్టర్, టోల్‌ఫ్రీ నంబర్‌ను మంగళవారం కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అవినీతిని తరిమేద్దాం.. దేశాభ్యుదయానికి పునాదులు వేద్దామనే నినాదంతో ముందుకుసాగాలన్నారు. ఎవరైనా లంచం అడిగితే వరంగల్ రేంజ్ ఏసీబీ ఫోన్ నంబర్ 9154388912కు గాని, టోల్ ఫ్రీ నంబర్ 1064కు గాని కాల్ చేసి నిర్మొహమాటంగా ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, వరంగల్ రేంజ్ ఏసీబీ సీఐ రాజు, డీపీఆర్వో రఫీక్, డీటీ ప్రసాద్ పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన సింగరేణి జీఎం

సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్‌రెడ్డి మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ టీఎస్.దివాకరను తన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా సింగరేణి భూసేకరణకు సంబంధించిన వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. జీఎం వెంట ఎస్ఓ రవీంద్ర, పర్యావరణ అధికారి పోషమల్లు, ఎస్టేట్ ఆఫీసర్ కార్తీక్, ఏరియా అధికార ప్రతినిధి కావూరి మారుతి ఉన్నారు.

ఎన్నికల హామీలు నెరవేర్చాలి

కేజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ.రమణ

ములుగు: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కల్లుగీత కార్మిక సంఘం(కేజీకేఎస్) రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ. రమణ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సంఘం 67వ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం ఏరియా ఆస్పత్రి నుంచి డీఎల్ఆర్ ఫంక్షన్‌హాల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సంఘం జిల్లా అధ్యక్షుడు పులి నర్సయ్యగౌడ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏజెన్సీ ఏరియాలో సొసైటీలను పునరుద్ధరించాలన్నారు. ప్రతీ గీతకార్మికుడికి సేఫ్టీ మోకులు, ద్విచక్ర వాహనం అందించాలని డిమాండ్ చేశారు. గీత కార్మికుల ఉపాధి మెరుగుపడాలంటే చెట్ల పెంపకానికి భూమి కేటాయించాలన్నారు. కల్లుకు ప్రత్యేక మార్కెట్ సౌకర్యం కల్పించాలన్నారు. రాష్ట్రంలో 5లక్షల మంది కల్లుగీత కార్మికులు కులవృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని నందనంలో నీరా ప్రాజెక్టుకు గత ప్రభుత్వం రూ.8కోట్లు కేటాయించిందని తెలిపారు. నేడు భవనం, మిషనరీలు పడావు పడి ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం జోక్యం చేసుకొని పునరుద్ధరణకు అవసరమైన నిధులు కేటాయించాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు, సుప్రజ ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ శిగ విజయ్‌కుమార్, సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుండెబోయిన రవిగౌడ్, సర్దార్ సర్వాయిపాపన్న మెమోరియల్ ట్రస్టు చైర్మన్ తాళ్లపల్లి రామస్వామి, జిల్లా కార్యదర్శి బుర్ర శ్రీనివాస్, గొల్లపల్లి రాజేందర్, ముస్నిపల్లి కుమార్‌గౌడ్, కక్కెర్ల అశోక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రమణ

మాదకద్రవ్యాల నిషేధం ప్రతీఒక్కరి బాధ్యత

జిల్లా సంక్షేమశాఖ అధికారి శిరీష

ములుగు రూరల్: మాదక ద్రవ్యాల నిషేధం ప్రతీఒక్కరి బాధ్యతని జిల్లా సంక్షేమశాఖ అధికారి శిరీష అన్నారు. మండల పరిధిలోని ఇంచర్ల ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు బానిసగా మారి భవిష్యత్‌ను నాశనం చేసుకోకూడదన్నారు. మాదక ద్రవ్యాల వినియోగంపై దుష్ప్రభావాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం సైకాలజిస్టు నమ్రత మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగంతో మానసిక, శారీరక సమస్యలు ఉత్పన్నమవుతాయని పలు సమస్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో బాలల పరిరక్షణ అధికారి ఓంకార్, బాలల సంక్షేమ సమితి సభ్యులు దామోదర్, పాఠశాల ప్రిన్సిపాల్ ఝాన్సీరాణి, హెల్పింగ్ హాండ్ సంస్థ సభ్యులు రజిత, కౌన్సిల్ మనోజ్‌కుమార్, చైల్డ్ హెల్ప్‌లైన్ కో ఆర్డినేటర్ నరేశ్, సోషల్ వర్కర్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శిరీష

సీఆర్‌టీ నోటిఫికేషన్ రద్దు చేయాలి

ప్రతులను దహనం చేస్తున్న నాయకులు

ఏటూరునాగారం: సీఆర్‌టీ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని ఏటీఎఫ్ జిల్లా అధ్యక్షులు మైపతి సంతోష్ కుమార్, తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పులిసె బాలకృష్ణ కోరారు. మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో సీఆర్‌టీ నోటిఫికేషన్ పత్రాలను తుడుందెబ్బ నాయకులు మంగళవారం దహనం చేశారు. అనంతరం నాయకులు డీడీ పోచంను కలిసి వినతిపత్రం అందజేశారు. నోటిఫికేషన్‌లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ షెడ్యూల్ ప్రాంతం 5 వ షెడ్యూల్‌కు వ్యతిరేకంగా ఉందని తెలిపారు. జీఓ నంబర్ 57ప్రకారం అర్హత కలిగిన ఆదివాసీ అభ్యర్థులతో మాత్రమే ఉద్యోగాలు భర్తీ చేయాలని చట్టం చెబుతుంటే డీడీ పోచం మాత్రం చట్టానికి విరుద్ధంగా నోటిఫికేషన్ విడుదల చేయడం దారుణమన్నారు. నోటిఫికేషన్‌లో అన్ని ఆశ్రమ పాఠశాలల్లో ఉన్న ఖాళీ సబ్జెక్టుల్లో భర్తీ చేయాలన్నారు. స్కూల్ అసిస్టెంట్లు పాఠాలు చెప్పాల్సిన చోట ఎస్‌జీటీ టీచర్లతో స్కూళ్లు నడిపిస్తున్నారని తెలిపారు. ఏజెన్సీ మారుమూల గ్రామాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను మండల కేంద్రానికి దగ్గర ఉన్న స్కూళ్లకి డిప్యూటేషన్‌పై పంపిస్తున్నారని తెలిపారు. అలాంటివి వెంటనే రద్దు చేయాలని కోరారు. అలాగే సీఆర్‌టీ నోటిఫికేషన్ రద్దు చేయాలని కోరుతూ ఈ నెల11న ఐటీడీఏ ఎదుట ధర్నా చేపడుతామని నోటీసులు అందజేశామని వివరించారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర నాయకులు పోడెం బాబు, పోడెం శోభన్, విద్యార్థి సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు కొప్పుల రవి, కార్యదర్శి గావిడి నాగబాబు తదితరులు పాల్గొన్నారు.



నోటిఫికేషన్ ప్రతులు దహనం చేస్తున్న నాయకులు

కారోబార్, బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలి

ములుగు: జిల్లాలోని ఆయా గ్రామ పంచాయతీల్లో కారోబార్లుగా, బిల్ కలెక్టర్లుగా విధులు నిర్వహిస్తున్న వారిని ఉద్యోగ అర్హత ఆధారంగా పర్మినెంట్ చేయడంతో పాటు సహాయ కార్యదర్శులుగా నియమించాలని తెలంగాణ గ్రామ పంచాయతీ కారోబార్, బిల్ కలెక్టర్ ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం డీపీఓ దేవరాజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు జితేంద్రాచారి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓరుగంటి రఘు మాట్లాడారు. 10 నుంచి 30 సంవత్సరాలుగా 103 మంది పంచాయతీల అభివృద్ధిలో భాగస్వాములు అవుతున్నామన్నారు. వారందరికీ ఉద్యోగ భద్రత, ఈపీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా, సంక్షేమ పథకాలను అమలు చేయాలని కోరారు. చాలీచాలని వేతనాలతో అనేక ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో సాంబయ్య, కుమారస్వామి, సత్యనారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.



డీపీఓకు వినతిపత్రం అందిస్తున్న కారోబార్లు, బిల్‌కలెక్టర్లు

మానవత్వం చాటుకున్న ఎస్పీ శబరీష్

ఏటూరునాగారం: ఎస్పీ డాక్టర్ శబరీష్ మానవత్వం చాటుకున్నారు. ద్విచక్ర వాహన ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి సపర్యలు చేసి మనోధైర్యం కల్పించారు. వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధిలోని చిన్నబోయినపల్లి వద్ద రాజుపేట గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ద్విచక్ర వాహనంపై మంగళవారం వెళ్తున్నాడు. కుక్కలు అడ్డురావడంతో అదుపుతప్పి కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ క్రమంలో ఏటూరునాగారం నుంచి ములుగు వైపు వెళ్తున్న ఎస్పీ వెంటనే తన వాహనాన్ని ఆపి గాయపడిన వ్యక్తి వద్దకు వెళ్లి సపర్యలు చేశారు. దాదాపు అరగంట పాటు బాధితుడు వద్ద ఉండి అతను కోలుకున్నాక ఆస్పత్రికి తరలించమని సిబ్బందికి చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయారు. అక్కడే ఉన్న స్థానికులు ఎస్పీకి అభినందనలు తెలిపారు.



గాయపడిన వ్యక్తిని పరిశీలిస్తున్న ఎస్పీ

కరీనా, శంకర్ ఆగయా..!

కాకతీయ జూపార్క్‌కు జంట పెద్ద పులులు

- రానున్న రెండు అడవి దున్నలు
- ఐదేళ్ల నిరీక్షణకు తెర..
- ప్రారంభించనున్న మంత్రి సురేఖ



శంకర్(10)మగపులి

న్యూశాయంపేట : వరంగల్ నగరంలోని కాకతీయ జూపార్క్‌కు ఆడపులి కరీనా (15), మగ పులి శంకర్ (10) వచ్చేశాయి. పర్యాటకులు ఎప్పుడెప్పుడా అని ఐదేళ్లుగా ఎదురుచూస్తున్న పెద్దపులుల దర్శన భాగ్యం త్వరలో కలగనుంది. రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా రెండు పెద్ద పులుల తోపాటు అడవిదున్నల ఎన్‌క్లోజర్‌లు, రెండు జింకల ఎన్‌క్లోజర్‌లను ప్రారంభించనున్నట్లు అటవీశాఖాధికారులు తెలిపారు.

ఐదేళ్ల కిందటే రావాల్సి ఉండే..

కాకతీయ జూపార్క్‌లో పెద్ద పులులు, అడవిదున్నల కోసం ఐదేళ్ల క్రితమే ఎన్‌క్లోజర్ పనులు ప్రారంభించారు. ఆ తరువాత ఎవరూ పట్టించుకోకపోవడం.. బడ్జెట్ లేదనే నెపంతో పనులను మధ్యలోనే వదిలేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. తూర్పు ఎమ్మెల్యే కొండా సురేఖ అటవీశాఖ మంత్రి కావడంతో జూపార్క్‌పై ప్రత్యేక దృష్టి సారించారు. ఎన్‌క్లోజర్‌ల పనులు పూర్తి చేసి రెండు పెద్ద పులులు, ఇతర జంతువులు వచ్చేలా చర్యలు తీసుకున్నారు.

హగ్ డీర్.. బార్‌కిన్ డీర్ వైజాగ్ నుంచి రాక..

కాకతీయ జూపార్క్‌కు రెండు జింక (హగ్ డీర్, బార్‌కిన్ డీర్)లను ఆంధ్రప్రదేశ్‌నుంచి తీసుకొచ్చినట్లు అటవీశాఖాధికారులు తెలిపారు. రెండు అడవిదున్నలు త్వరలో రానున్నట్లు చెప్పారు. సెంట్రల్ జూపార్క్ అథారిటీ అనుమతితో ఈ జంతువులను జూపార్క్‌కు తీసుకొస్తున్నట్లు వివరించారు. వాటి కోసం ప్రత్యేకమైన ఎన్‌క్లోజర్‌లు ఏర్పాటు చేశామన్నారు.

సిద్ధసముద్రంలో పూడిక తీస్తే మేలు..

జూపార్క్.. సిద్ధ సముద్రం చెరువు ప్రాంతంలో చుట్టూ ఎత్తయిన కొండల మధ్య 47.64 ఎకరాల్లో విస్తీర్ణం కలిగి ఉంది. ఇందులో వివిధ జంతువుల ఎన్‌క్లోజర్‌లకు పోను సిద్ధసముద్రం చెరువు కొంతమేర ఉంటుంది. అప్పట్లో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు చెరువులో పూడిక తీసి బోటింగ్ సౌకర్యం కల్పిస్తామని పార్క్‌ను సందర్శించిన సందర్భంగా తెలిపారు. ఆ తర్వాత పట్టించుకోలేదు. కొండా సురేఖ అటవీశాఖ మంత్రి కావడం, జూపార్క్‌కు ప్రతేక నిధులు కేటాయించి సిద్ధసముద్రంలో పూడిక తీసి బోటింగ్ సదుపాయం కల్పించాలని పర్యాటకులు, నగరవాసులు కోరుతున్నారు.

ఇక్కడి వాతావరణానికి అలవాటు పడాలి..

కాకతీయ జూపార్క్‌కు రెండు పెద్ద పులులు వచ్చాయి. రెండు జింకలు వైజాగ్ నుంచి ఇటీవల తీసుకొచ్చాం. రెండు అడవిదున్నలు త్వరలో రానున్నాయి. ఇక్కడి వాతావరణానికి అలవాటు పడేదాక సంరక్షణ చర్యలు తీసుకుంటున్నాం. అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా ప్రారంభిస్తాం. ఆ తరువాత సందర్శకులకు అనుమతిస్తాం.

– భీమానాయక్, అటవీ ముఖ్య సంరక్షణాధికారి, భద్రాద్రి సర్కిల్



కరీనా(15)ఆడపులి

క్లుప్తంగా

ఉద్యమకారులు ఐక్యత చాటాలి



సమావేశంలో మాట్లాడుతున్న సునీల్‌కుమార్

హన్మకొండ : స్వరాష్ట్ర, స్వపరిపాలన, నీళ్లు, నిధులు, నియామకాలు, ఆత్మగౌరవ నినాదాలతో రాష్ట్రాన్ని పాలించుకుందామని తెలంగాణ ఉద్యమకారుల సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు సందెల సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో సంఘం ముఖ్యనాయకుల సమావేశం జరిగింది. ముందు ఉద్యమ అమరుడు శ్రీకాంతాచారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉద్యమకారులకు జరుగుతున్న అన్యాయాల పై ఎప్పటికప్పుడు పోరాటం చేస్తున్నామని, ఉద్యకారులు కలిసి వచ్చి ఐక్యత చాటాలని పిలుపునిచ్చారు. తొలిదశ ఉద్యమంలో 369 మంది అమరులు కాగా, మలి దశలో 1300 మంది అమరులయ్యారన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని సమావేశాలు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో సంఘం నాయకులు గుర్రం రఘు, బాబు, కాశబోయిన యాకన్న, ఇమ్మడి రవీందర్, గజ్జి సంతోశ్, ముద్దసాని వెంకటేశ్వర్లు, వాసిరెడ్డి నరసింహారెడ్డి, సమ్మన్న, కక్కెర్ల వెంకన్న, ఎర్రవెల్లి దండయ్య, రమేశ్, శంకర్‌రావు, కోదండరాం, పరశురాములు, మొగిలి, తదితరులు పాల్గొన్నారు.

ఊడిన గూడ్స్ రైలు లింక్

- పట్టాలపై నిలిచిన బోగీలు



పట్టాలపై నిలిచి ఉన్న గూడ్స్ రైలు బోగీలు

మహబూబాబాద్ రూరల్ : గూడ్స్ రైలు బోగీల లింక్ ఊడిపోవడం (అన్ కప్లింగ్)తో వెనుక భాగంలో ఉన్న మూడు బోగీలు పట్టాలపై నిలిచాయి. ఫలితంగా రైలు రెండు భాగాలుగా విడిపోయింది. ఈ ఘటన మంగళవారం ఉదయం మహబూబాబాద్ రైల్వే స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. డోర్నకల్ వైపు నుంచి కాజీపేట వైపునకు మహబూబాబాద్ రైల్వే స్టేషన్ మీదుగా అప్ లైన్‌లో ఓ గూడ్స్ రైలు వెళ్తోంది. ఈ క్రమంలో గేట్ క్యాబిన్ సమీపంలో లింక్ ఊడిపోవడంతో సదరు గూడ్స్ రైలుకు వెనుక భాగంలో ఉన్న మూడు బోగీలు పట్టాలపై నిలిచాయి. గూడ్స్ రైలు రెండు భాగాలుగా విడిపోయిన విషయాన్ని గమనించిన గార్డు వెంటనే లోకో పైలట్‌ను అప్రమత్తం చేయడంతో వెంటనే నిలిపివేశాడు. సమాచారం తెలుసుకున్న రైల్వే అధికారులు, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మరమ్మతులు చేసి గూడ్స్ రైలును పంపించారు. కాగా, 45 నిమిషాలపాటు బోగీలు పట్టాలపై నిలిచిపోవడంతో ఎగువ మార్గంలో వెళ్లాల్సిన పలు రైలు ఆలస్యంగా నడవగా ప్రయాణికులు ఇబ్బందులుపడ్డారు.

జాగ్రత్తగా ముందుకుసాగు..

- విత్తన ఎంపిక, కొనుగోళ్లపై అవగాహన ఉండాలి
- అప్పుడే పంటలో అధిక దిగుబడి, లాభాలు
- మానుకోట వ్యవసాయ శాఖ అధికారి ఎం.విజయ నిర్మల
- రైతులకు పలు సలహాలు, సూచనలు





ఎం. విజయ నిర్మల, డీఏఓ

మహబూబాబాద్ రూరల్ : సాగు సమయంలో అన్నదాతలు విత్తనాల ఎంపిక, కొనుగోళ్లలో జాగ్రత్తలు తీసుకోవాలి. ఏ భూమిలో ఏ పంట వేయాలి.. ఏ కంపెనీ విత్తనాలు కొనుగోలు చేయాలి.. ఏ పంటకు గిట్టుబాటు ధర ఉంటుందనే అంశాలపై అవగాహన ఉండాలి. అప్పుడే వివిధ పంటల్లో అనుకున్న మేర దిగుబడి వచ్చి అధిక లాభాలు గడిస్తారు. లేని పక్షంలో తీవ్ర నష్టానికి గురయ్యే అవకాశాలు ఉంటాయి. ఈ నేపథ్యంలో విత్తన ఎంపిక, కొనుగోళ్లతో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మహబూబాబాద్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎం.విజయనిర్మల మంగళవారం రైతులకు ముఖ్యమైన అంశాలు తెలిపారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే.

విత్తనాల ఎంపిక, కొనుగోలు సమయంలో గమనించాల్సిన అంశాలు :

- విత్తనాల ఎంపిక పంటల దిగుబడిలో కీలకమైంది. సరైన విత్తనాలను ఎంపిక చేయడం ద్వారా అధిక, నాణ్యమైన దిగుబడి పొందొచ్చు.

పంటకు అనుగుణంగా ఎంపిక :


- భూమి, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఉండే పంట రకాలను మాత్రమే ఎంచుకోవాలి.

పంట రకం ఆధారంగా ఎంపిక:

- రైతులు ఎంచుకునే విత్తనాలు వారి పంట రకానికి అనుగుణంగా ఉండాలి. ఉదాహరణకు నీటి వనరులు తక్కువ ఉండే ప్రాంతాల్లో నీటి ఎద్దడిని తట్టుకునే రకాలు, తక్కువ నీటితో ఎదిగే రకాలను ఎంపిక చేసుకోవాలి. ఎక్కువ వర్షపాతం ప్రాంతాల్లో నీరు ఎక్కువ కాలం పొలంలో నిలిచి ఉంటుంది. ఇలాంటి పరిస్థితిని తట్టుకునే రకాలను, తడిని తట్టుకునే రకాలను ఎంచుకోవాలి.

తాజా విత్తనాలు :

- పాత విత్తనాలకంటే తాజా గత పంటకాలంలో ఉత్పత్తి చేసిన విత్తనాలను కొనుగోలు చేయడం ఉత్తమం. తెగుళ్లు, పురుగులను తట్టుకునే రకాలను ఎంపిక చేసుకోవాలి.



రోగ నిరోధకత :

- రోగ నిరోధక శక్తి కలిగిన విత్తనాలను ఉపయోగించడం ద్వారా పంటలకు రోగాల నుంచి రక్షణ కల్పించొచ్చు.

అధిక దిగుబడి రకం :

- అధిక దిగుబడిని అందించే రకాలను ఎంపిక చేసుకోవడం ద్వారా లాభాలు పెంచుకోవచ్చు.

ప్యాకింగ్, గడువు తేదీ :

గడువు దాటిన విత్తనాలను ఎట్టి పరిస్థితులలో కొనుగోలు చేయొద్దు. ప్యాకింగ్ తేదీ, గడువు తేదీని సరిచూసుకోవాలి. కొనుగోలు చేసిన విత్తన ప్యాకెట్ సంచి, డబ్బాలపై సీలు ఉందా లేదా అని సరిచూసుకోవాలి. విత్తన ప్యాకెట్లపై ముద్రించిన సమాచారాన్ని బిల్లులో ఉన్న వివరాలతో సరిచూసుకోవాలి. రైతు కొనుగోలు చేసే సమయంలో కొనదలచిన రకం/ వంగడం/ హైబ్రిడ్ లక్షణాలను డీలర్ దగ్గర తెలుసుకుని, ఏదైనా కరపత్రం తీసుకోవడం ద్వారా క్షేత్ర స్థాయి ఇబ్బందులు కొంత వరకు ఎదుర్కొవచ్చు.

విత్తన నమూనా పరీక్ష :

- పంట విత్తుకునే ముందు కొనుగోలు చేసిన విత్తనాల నుంచి కొన్నింటిని తీసుకుని మొలక శాతం కోసం పరీక్షించుకోవాలి.
- మార్కెట్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని అధికంగా అమ్మకాల అవకాశాలు ఉన్న పంట రకాలను ఎంచుకోవాలి.
- వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన ఆధీకృత డీలర్ల దగ్గర మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలి.
- నిర్ణీత ఫార్మాట్‌లో ఉన్న బిల్లు (రసీదు) అనగా దుకాణదారుడి అడ్రస్, పేరు, సీడ్ లైసెన్స్ నంబర్, -జీఎస్టీ నంబర్, తదితర వివరాలు ఉన్న పత్రానే రసీదుగా అంగీకరించాలి.
- నకిలీ విక్రయదారుల నుంచి ఎట్టి పరిస్థితుల్లో విత్తనాలు కొనుగోలు చేయొద్దు.
- విత్తన కొనుగోలు బిల్లులో కొనుగోలు చేసిన విత్తన వివరాలు అనగా పంట పేరు, రకం, తయారుదారీపేరు, లాట్ నంబర్, గడువు తేదీ తప్పనిసరిగా సరిచూసుకోవాలి.
- విత్తన కొనుగోలు బిల్లులో అమ్మకందారు సంతకం, కొనుగోలుదారు సంతకం తప్పనిసరిగా ఉండాలి. విత్తన కొనుగోలు బిల్లు, విత్తన ప్యాకెట్లను పంట కాలం ముగిసి పంట చేతికి వచ్చేవరకు భద్రపరుచుకోవాలి. లూజుగా ఉన్న సంచులు, పగిలిన ప్యాకెట్లు డబ్బాల్లో ఉన్న విత్తనాలను కొనుగోలు చేయొద్దు.

పోలీసుల అదుపులో రాయపర్తి ఎస్‌బీఐ చోరీ నిందితులు?

- వాహన యజమానితోపాటు మరొకరికి సంకెళ్లు
- వీరిచ్చిన సమాచారంతోనే కొలిక్కి వస్తున్న కేసు
- త్వరలోనే మిగిలిన నిందితులతో అరెస్టు ప్రకటించే అవకాశం

సాక్షి, వరంగల్: వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ)లో 19 కిలోల బంగారం చోరీ కేసును సవాల్‌గా తీసుకున్న పోలీసులు రెండు వారాలయ్యాక కాస్త పురోగతి సాధించారు. ఈ నేరానికి ఉపయోగించిన వాహన యజమానితోపాటు మరొకరిని మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ సరిహద్దులో ప్రత్యేక బృందాలు అదుపులోకి తీసుకొని మంగళవారం వరంగల్‌కు తీసుకొచ్చినట్టు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. గత నెల 18న అర్ధరాత్రి దాటాక రాయపర్తి ఎస్‌బీఐలో 19 కిలోల బంగారం ఎత్తుకెళ్లినట్టుగా భావిస్తున్న మరో నలుగురు నిందితుల ఆచూకీని కనుగొన్న ప్రత్యేక బృందాలు వారు చోరీ చేసిన బంగారాన్ని రికవరీ చేసే ప్రయత్నాల్లో ఉన్నట్టుగా తెలిసింది. ఘటనా స్థలి వద్ద లభించిన ఆక్సిజన్ సిలిండర్‌తోపాటు చోరీ సొత్తుతో రాయపర్తి నుంచి ఖమ్మం హైవే మీదుగా వెళ్లే సమయంలో సీసీ టీవీ కెమెరాలకు చిక్కిన వాహన నంబర్, ఘటనాస్థలిలో లభించిన మరిన్ని శాస్త్రీయ ఆధారాలతో పాత నేరస్తుల పనే అని పోలీసులు నిర్ధారణకు వచ్చారు. కర్ణాటక, తమిళనాడు, యూపీ, మధ్యప్రదేశ్ పోలీసులతో సంప్రదింపులు జరిపారు. ఇక్కడ చోరీ జరిగిన విధానాన్ని బట్టి అక్కడ జరిగిన చోరీల విధానం తెలుసుకోవడంతో ఈ కేసుపై క్లారిటీ వచ్చింది. దీంతో రంగంలోకి దిగిన 19 ప్రత్యేక బృందాలు ఆయా రాష్ట్రాల్లో తిరిగి ఆ ముఠా కదలికలపై ఆరా తీసినట్టు తెలిసింది. టెక్నికల్ బృందం ఇచ్చిన ప్రత్యేక సహకారంతోనే ఈ కేసులో కీలకంగా ఉన్న వాహన ఆచూకీని ఉత్తరప్రదేశ్ సరిహద్దులో కనుగొని ఆ వాహన యజమానితోపాటు మరొకరిని అదుపులోకి తీసుకున్నారు. వీరిచ్చిన సమాచారం ఆధారంగానే ఈ కేసు కొలిక్కి వచ్చినట్టుగా తెలిసింది. ఇటీవల రాచకొండ పోలీసులు, కర్ణాటక పోలీసులు రాయపర్తిలోని చోరీ జరిగిన బ్యాంక్‌ను పరిశీలించి వెళ్లాక కేసు దర్యాప్తులో వేగిరం పెరిగింది. ఆ ఇద్దరు నిందితులను పట్టుకోవడంతో వరంగల్ పోలీసులు కాస్త ఉపశమనం పొందినట్టుగా కనిపిస్తోంది. బంగారం రికవరీ అయ్యాకనే నిందితులను మీడియా ముందుకు తీసుకొచ్చే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది.

రేపు డీఈఈసెట్ అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్

విద్యారణ్యపురి: డిప్లొమా ఇన్ ఎలమెంటరీ ఎడ్యుకేషన్ (డీఎల్‌ఈడీ), డిప్లొమా ఇన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్ (డీపీఎస్‌ఇ)లలో అర్హత సాధించిన ఉమ్మడి వరంగల్ జిల్లా అభ్యర్థుల్లో ఇంతకు ముందు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ హాజరుకాని వారు ఈనెల 5న(గురువారం) హనుమకొండ ప్రభుత్వ డైట్ కళాశాలకు హాజరై తమ సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకోవాలని ప్రిన్సిపాల్ ఎండీ అబ్దుల్‌హై మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తమ వెంట దరఖాస్తు ఫామ్, హాల్‌టికెట్, డీఈఈసెట్ 24 ర్యాంకు కార్డు, టెన్త్‌తోపాటు తదితర విద్యార్హతల సర్టిఫికెట్లు తీసుకురావాలన్నారు. అభ్యర్థులు ఈరెండో దశలో వెబ్ ఆప్షన్లకు ఈనెల 7 నుంచి 9వ తేదీవరకు ఇవ్వాల్సింటుంది. రిజర్వేషన్ మెరిట్ ప్రాతిపదికన ఈనెల 13న సెకండ్ ఫేజ్‌లో భాగంలో స్లైడింగ్, ఫ్రెష్ అభ్యర్థులకు కూడా సీట్లు కేటాయింపు ఉంటుందన్నారు. సీట్లు పొందిన అభ్యర్థులు ఈనెల 13 నుంచి 17వ తేదీ వరకు ఫీజు చెల్లించి అలాట్‌మెంట్ లెటర్‌ను డౌన్‌లోడ్ చేసుకుని సంబంధిత కళాశాలలో ఈనెల 18నుంచి 21వ తేదీ వరకు రిపోర్టు చేయాల్సింటుందన్నారు.

బీ–కేటగిరీ సీట్లలో అడ్మిషన్ల ప్రక్రియ ఇలా..

బీ–కేటగిరీ సీట్లు భర్తీచేసే సమయంలో ప్రైవేట్, మైనార్టీ డైట్ కళాశాలల యాజమాన్యాలు ఈనెల 5న నోటిఫికేషన్ జారీచేస్తాయని తెలిపారు. ఈనెల 7నుంచి 9వతేదీవరకు దరఖాస్తులు స్వీకరిస్తారని పేర్కొన్నారు. అభ్యర్థుల సర్టిఫికెట్లు, దరఖాస్తులను డైట్ ప్రిన్సిపాల్ ఈనెల 13నుంచి 17వ తేదీ వరకు పరిశీలిస్తారన్నారు. ఈనెల 18న యాజమాన్యాలు సీట్ల కేటాయిస్తాయన్నారు. సీట్లు పొందిన అభ్యర్థులు ఈనెల 18 నుంచి 20 వరకు సంబంధిత డైట్ కళాశాలలో రిపోర్టు చేయాల్సింటుందని ప్రిన్సిపాల్ అబ్దుల్‌హై తెలిపారు.

హరీశ్‌కు కన్నీటి వీడ్కోలు..

- ముగిసిన ఎస్సై అంత్యక్రియలు
- శోకసంద్రంగా వెంకటేశ్వర్లపల్లి
- బాధిత కుటుంబీకులకు భూపాలపల్లి ఎమ్మెల్యే, ములుగు ఎస్పీ పరామర్శ



హరీశ్ మృతదేహం వద్ద విలపిస్తున్న తల్లిదండ్రులు

రేగొండ: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కొత్తపల్లిగోరి మండలం వెంకటేశ్వర్లపల్లిలో వాజేడు ఎస్సై రుద్రారపు హరీశ్ అంత్యక్రియలు మంగళవారం అశ్రునయనాల మధ్య ముగిశాయి. హరీశ్‌ను కడసారి చూసేందుకు గ్రామంతో పాటు చుట్టూ పక్కల ప్రజలు, బాల్యమిత్రులు, సహచర ఎస్సైలు పెద్ద ఎత్తున గ్రామానికి చేరుకున్నారు. పది రోజుల్లో నిశ్చితార్థం జరగాల్సిన కొడుకు జిల్లేడ్ చెట్టుతో పెళ్లి చేస్తుంటే తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించిన తీరు స్థానికులను కంటతడి పెట్టించింది. మరోవైపు హరీశ్ తల్లి మల్లికాంబ.. 2020 బ్యాచ్‌కు చెందిన ఎస్సైలు, తన కొడుకు మిత్రులను పట్టుకుని గుండెలవిసేలా రోదించింది. అంతిమయాత్రలో బంధువులు, స్నేహితులు, గ్రామస్తులు పాల్గొని కన్నీటి పర్యంతమయ్యారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, ములుగు ఎస్పీ శబరీశ్ వేర్వేరుగా ఎస్సై హరీశ్ పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎస్సై కుటుంబానికి అండగా ఉంటామన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



సంపత్ (ఫైల్)

నెక్కొండ: పిల్లల చదువులు కొనసాగేందుకు, వ్యవసాయం కోసం చేసిన అప్పులు తీర్చేదారి లేక ఓ రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మంగళవారం వరంగల్ జిల్లా నెక్కొండ మండలం దీక్షకుంటలో జరిగింది. ఎస్సై మహేందర్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన తోట సంపత్ (47)కు ముగ్గురు కుమారులు సురేందర్, నరేందర్, రాజేందర్ ఉన్నారు. వీరి చదువుల కోసం, వ్యవసాయ పనుల నిమిత్తం ట్రాక్టర్‌ను కొనుగోలుకు సుమారు రూ. 20లక్షల అప్పు చేశాడు. అప్పు తీర్చేందుకు కొంత కాలంగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో అప్పు తీర్చే మార్గం కనిపించకపోవడంతో సోమవారం రాత్రి గడ్డి మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు చికిత్స నిమిత్తం నర్సంపేట ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయాడు. ఈ ఘటనపై మృతుడి భార్య స్వరూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై మహేందర్ తెలిపారు.

‘సీఎం కప్’కు నమోదు ఇలా..

- ఏయే క్రీడలు.. ఎప్పుడెప్పుడంటే?
- వివరాలు వెల్లడించిన హనుమకొండ డీవైఎస్‌ఓ అశోక్‌కుమార్



వరంగల్ స్పోర్ట్స్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించబోతున్న సీఎం కప్–2024లో పోటీల్లో మీరు పాల్గొంటున్నారా? అయితే మీ పేర్లు ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోండి. ఇందుకు సంబంధించిన వెబ్‌సైట్ మంగళవారం ప్రారంభమైంది. ఈమేరకు గ్రామ, మండల, జిల్లా స్థాయిలో జరిగే ఈ పోటీలు ఏయే తేదీల్లో, ఏయే క్రీడలు జరుగుతాయనే వివరాలను హనుమకొండ డీవైఎస్‌ఓ గుగులోత్ అశోక్‌కుమార్ వెల్లడించారు. గ్రామపంచాయతీ స్థాయిలో ఈ నెల 7, 8వ తేదీల్లో, మండల స్థాయిలో 10, 12వ తేదీల్లో, జిల్లా స్థాయిలో 16 నుంచి 21వ తేదీ వరకు పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ఆయా పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు https:// cmcup2024. telangana.gov.inలో పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఓటీపీ లేకుండా అయితే https:// cmcup2024. telangana. gov.in/offlineregister/156లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ లింక్ ఈ నెల 6వ తేదీ వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. క్రీడా సంఘాల బాధ్యులు, పీఈటీ, పీడీలు క్రీడాకారుల వివరాలు పొందుపరచాలని సూచించారు.

గ్రామ పంచాయతీ స్థాయిలో క్రీడలు..

- అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, యోగా నిర్వహించనున్నారు. పోటీల నిర్వహణ కమిటీ చైర్మన్‌గా పంచాయతీ సెక్రటరీ, సభ్యులుగా స్కూల్ హెచ్‌ఎం, పీఈటీ, సీనియర్ క్రీడాకారుడు కొనసాగుతారు. కోఆర్డినేటర్‌గా ఎంపీడీఓ వ్యవహరిస్తారు.

మండల స్థాయిలో..

- అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, యోగా.

మండల స్థాయి ఎంపిక పోటీలు..

- బ్యాడ్మింటన్, బాక్సింగ్, స్విమ్మింగ్, రెజ్లింగ్, బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, చెస్, బేస్‌బాల్, నెట్‌బాల్, కిక్‌బాక్సింగ్, సైక్లింగ్, ఉషు, జూడో, స్నూకర్ క్రీడాంశాల్లో మండల స్థాయిలో ఎంపికలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా స్థాయికి ఎంపిక చేయనున్నట్లు డీవైఎస్‌ఓ తెలిపారు.
- ఈ పోటీల నిర్వహణ కమిటీ చైర్మన్‌గా ఎంపీడీఓ, సభ్యులుగా తహసీల్దార్, ఎంఈఓ లేదా గెజిటెడ్ హెచ్‌ఎం, ఎస్సై, ఎస్‌జీఎఫ్ మండల కార్యదర్శి, సీనియర్ క్రీడాకారుడు ఉంటారు.

జిల్లా స్థాయిలో క్రీడా పోటీలు ..

- జిల్లా స్థాయిలో చాంపియన్‌షిప్ కోసం అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాక్సింగ్, స్విమ్మింగ్, రెజ్లింగ్, బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, ఫుట్‌బాల్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, యోగా, చెస్, బేస్‌బాల్, నెట్‌బాల్, కిక్‌బాక్సింగ్, సైక్లింగ్ , ఉషు, జూడో, స్నూకర్ పోటీల్లో విజేతలకు చాంపియషిప్‌గా నిలిచిన క్రీడాకారులకు బహుమతులు అందజేయనున్నారు.

జిల్లా స్థాయి ఎంపిక పోటీలు..

- టేబుల్ టెన్నిస్, లాన్‌టెన్నిస్, వెయిట్‌లిఫ్టింగ్, జిమ్నాస్టిక్స్, షూటింగ్, హాకీ, సెపక్‌తక్రా, కరాటే, రోయింగ్, స్క్వాష్, కనోయింగ్‌కాయాకింగ్, ఆట్యాపాట్యా, పవర్ లిఫ్టింగ్, సాఫ్ట్‌బాల్, తైక్వాండో ఉంటుంది.

జిల్లా స్థాయి నిర్వహణ కమిటీ..

- జిల్లా స్థాయిలో నిర్వహించే పోటీల నిర్వహణ కమిటీ చైర్మన్ కలెక్టర్ , వైస్ చైర్మన్‌గా సిటీ పోలీస్ కమిషనర్ , మున్సిపల్ కమిషనర్లు, కో–వైస్ చైర్మన్‌గా అడిషనల్ కలెక్టర్, మెంబర్ కన్వీనర్‌గా డీవైఎస్‌ఓ, సభ్యులుగా జిల్లా ఒలింపిక్స్ సంఘం అధ్యక్షుడు, డీఈఓ, జీఎం ఇండస్ట్రీస్, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ వ్యవహరించనున్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలు..

- హనుమకొండ జిల్లా కేంద్రంగా సీఎం కప్ రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించేందుకు ప్రభుత్వం కొన్ని క్రీడలు కేటాయించింది. అథ్లెటిక్స్, జిమ్నాస్టిక్స్, షటిల్ బ్యాడ్మింటన్, హ్యాండ్‌బాల్, సెపక్‌తక్రా పోటీలు జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం వేదికగా జరగనున్నట్లు డీవైఎస్‌ఓ గుగులోత్ అశోక్‌కుమార్ తెలిపారు.

రోజంతా పడిగాపులు..



భద్రు మృతదేహాన్ని వ్యాన్‌లోకి ఎక్కిస్తున్న పోలీసులు



మృతదేహాలను తీసుకెళ్లేందుకు వచ్చిన కామేశ్, కరుణాకర్ కుటుంబీకులు

- 2న ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చిన భద్రు కుటుంబీకులు
- కోర్టులో పిటిషన్ నేపథ్యంలో మంగళవారం మృతదేహాల అప్పగింత

ఏటూరునాగారం : ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం చెల్పాకలో ఆదివారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మావోయిస్టుల మృతదేహాలకు సోమవారం ఏటూరునాగారం ప్రభుత్వ ఆస్పత్రిలో కాకతీయ మెడికల్ కళాశాల ఫోరెన్సిక్ నిపుణులు పోస్టుమార్టం నిర్వహించారు. అయితే ఏడుగురు మావోయిస్టుల్లో ఏగొలపు మల్లయ్య మృతిపై అనుమానం ఉందని ఆయన భార్య మీనా హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. దీంతో పోలీసులు ఆయా కుటుంబాలకు సోమవారం మృతదేహాలు అప్పగించకుండా కోర్టు తీర్పు కోసం వేచి చూశారు. అయితే మల్లయ్య మృతదేహాన్ని గురువారం వరకు ఆస్పత్రిలోనే భద్రపర్చాలని కోర్టు ఆదేశాలు ఇచ్చింది. మిగతా ఆరుగురు మావోయిస్టుల మృతదేహాలను తీసుకెళ్లేందుకు ఛత్తీస్‌గఢ్ నుంచి వారి కుటుంబీకులు సోమవారం ఏటూరునాగారం చేరుకోగా కోర్టులో పిటిషన్‌పై విచారణ జరుగుతుండడంతో మంగళవారం వరకు పడిగాపులు కాశారు. ఎలాంటి అభ్యంతరాలు లేకుంటే మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించాలని మంగళవారం కోర్టు ఆదేశాలు జారీ చేయడంతో భారీ బందోబస్తు మధ్య మృతదేహాలను అప్పగించారు. ములుగు డీఎస్పీ రవీందర్, ఏటూరునాగారం సీఐ అనుముల శ్రీనివాస్.. స్పెషల్ పార్టీ పోలీసులతో భారీ బందోబస్తు చేపట్టారు.

మల్లయ్య మృతదేహం అప్పగింత గురువారం వరకు వాయిదా..

ఏగొలపు మల్లయ్య అలియాస్ మధు మృతిపై అనుమానాలున్నాయని హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయడంతో మల్లయ్య మృతదేహాన్ని గురువారం వరకు ఇక్కడే భద్రపర్చాలని కోర్టు ఆదేశాలు ఇచ్చిందని మధు భార్య మీనా తెలిపారు. గాంధీ ఆస్పత్రి ఫోరెన్సిక్ నిపుణులతో పోస్టుమార్టం చేయించాలని కోరామన్నారు. నిపుణులు అందుబాటులో లేకపోవడం, ఇతర కారణాల దృష్ట్యా గురువారం వరకు మృతదేహాన్ని తీసుకెళ్లడం లేదని ఆమె తెలిపారు.

గుండెపోటుతో మార్కెట్ డైరెక్టర్ మృతి

- ఐదు రోజుల్లో తనయుడి పెళ్లి..
- పెళ్లింట్లో విషాదఛాయలు



రమేశ్ (ఫైల్)

రఘునాథపల్లి : మండలంలోని ఖిలాషాపూర్‌కు చెందిన జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గాదె రమేశ్ (56) మంగళవారం గుండెపోటుతో మృతి చెందాడు. ఐదు రోజుల్లో కుమారుడి పెళ్లి పనుల్లో బిజీగా ఉన్న రమేశ్ సోమవారం కొంత అలసటకు గురికావడంతో హనుమకొండలోని ఓ ఆసుపత్రికి వెళ్లాడు. అక్కడ చికిత్స పొందుతూ అర్ధరాత్రి దాటాక గుండెపోటుతో చనిపోయాడు. ఈ నెల 8న కుమారుడి పెళ్లి ఉండడంతో శుభలేఖలు కూడా పంచారు. కుటుంబ సభ్యులందరూ పెళ్లి పనుల్లో నిమగ్నమయ్యారు. అలసటగా ఉందని ఆసుపత్రికి వెళ్లి గుండెపోటుతో మృతి చెందడంతో పెళ్లి జరగాల్సిన ఇంట్లో విషాదం అలుముకుంది. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి, జనగామ మార్కెట్ కమిటీ చైర్మన్ శివరాజ్‌యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, పలువురు నేతలు ఖిలాషాపూర్ చేరుకుని రమేశ్ పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కాగా, రమేశ్ మృతిపై కాంగ్రెస్ నేతలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు, మృతుడికి భార్య రజిత, కుమారుడు సృజన్, ఇద్దరు కుమార్తెలు శృతి, సుప్రియ ఉన్నారు.

వరకట్న వేధింపులకు వివాహిత బలి

- పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మృతి



రమ్య (ఫైల్)

సంగెం: వరకట్న వేధింపులకు ఓ వివాహిత బలైంది. ఈ ఘటన సంగెం మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. నెక్కొండ మండలం అప్పల్‌రావుపేటకు చెందిన బీరం మల్లేశం రెండో కూతురు రమ్య (23)ను సంగెం మండలం తీగరాజుపల్లికి చెందిన జుర్రు ప్రశాంత్‌కు ఇచ్చి 2021 సంవత్సరంలో వివాహం జరిపించారు. వివాహ సమయంలో వరకట్నం కింద అర ఎకరం భూమి, 4 తులాల బంగారం, రూ. 50వేల నగదును ముట్టజెప్పారు. ఈ దంపతులకు రెండున్నర ఏళ్ల కుమారుడు నిహన్‌రాజు ఉన్నాడు. ఇటీవల ప్రశాంత్ వ్యాపారం చేస్తున్నానని, అప్పులు అయ్యాయని చెప్పి భార్య రమ్యను అదనపు కట్నం తీసుకురావాలని వేధింపులకు గురిచేస్తున్నాడని పలుమార్లు ఫోన్‌లో తండ్రి మల్లేశంకు తెలిపింది. ఈ క్రమంలో భర్త వేధింపులు భరించలేక ఈ నెల 1వ తేదీన పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబీకులు ఎంజీఎం తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందింది. ఈ ఘటనపై మృతురాలి తండ్రి మల్లేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ పేర్కొన్నారు.